# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 7, నవంబర్ 2025




## కార్మికుల హక్కులను కాల రాస్తే
# సహించేది లేదు

★ కాసిపేట 2వ గని పై ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

★ పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**కాసిపేట, నవంబర్ 6, ప్రభాతవార్త**



ఏఐటీయూసీ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కాసిపేట రెండవ గని పై పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇతరత్రా యూనియన్లు కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఏఐటీయూసీ మాత్రం ఎల్లప్పుడూ కార్మికుల వెంటే ఉంటుందని ఆయన అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని తెలిపారు. కార్మికుల ముఖ్యమైన డిమాండ్‌లను రాతపూర్వకంగా యజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. యాజమాన్యం సంవతర కాలంగా నిలిపివేసిన మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలి. మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియ పాత పద్ధతిలోనే కొనసాగేలా చొరవ చూపాలి. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలు అందజేయాలి, సింగరేణి ఉద్యోగుల సొంత ఇల్లు పథకంను అమలు చేయాలి, అలవెన్స్‌పై విధించే ఆదాయపన్నును కోల్ ఇండియా మాదిరిగా యాజమాన్యమే భరించాలి. వికే కోల్ మైన్ మరియు జెకే ఎక్స్టెన్షన్ ఓపెన్‌కాస్ట్‌లలో పర్మనెంట్ ఉద్యోగులతోనే నడపాలి. మారుపేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి సమస్యను మానవతా దృక్పథంతో విజిలెన్స్ ద్వారా విచారణ జరిపి ఉద్యోగం కల్పించాలి. డిస్మిస్ అయిన ఉద్యోగులకు ఒకసారి మళ్లీ ఒక అవకాశం కల్పించాలి. డిసిప్లినరీ చర్యలలో భాగంగా కార్మికులపై తీవ్ర ఒత్తిడి కల్పించే 150 మస్టర్లు చేయాలనే సర్క్యులర్‌ను రద్దు చెయ్యాలి. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను తక్షణమే నిర్వహించాలి. ఓవర్‌మెన్‌గా అర్హత పొందిన సీనియర్ మైనింగ్ సర్దార్లకు డిఎంహెచ్ డిప్లొమా హోల్డర్లకు ఓవర్‌మెన్‌గా పదోన్నతి కల్పించాలి. అదేవిధంగా కాసిపేట2 గనిలో సేఫ్టీ గ్లౌజులు, కోల్ కటింగ్ డ్రిల్ రాడ్లు, కోల్ కటింగ్ బిట్లు, సపోర్టింగ్ బిట్లు, ఎస్ డి ఎల్ స్పేర్ పార్ట్స్ నాణ్యమైన మిగతా 2లో..

# ఏసిబీ వలలో మరో ప్రభుత్వ అధికారి..

**రూ. 75 వేలు లంచం తీసుకుంటూ దొరికిన డిసీఎస్‌ఓ డిఎం నర్సింగరావు**

**20 రోజుల వ్యవధిలో జిల్లాలో రెండో అవినీతి కేసు**

**ఆసిఫాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త**



రైస్ మిల్ యజమాని వద్ద జిల్లా పౌర సరఫరాల శాఖ డిఎం రూ. 75 వేల తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న సంఘటన గురువారం సాయంత్రం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. అదిలాబాద్ ఏసిబి డిఎస్పి మధు తెలిపిన వివరాల ప్రకారం రైస్ మిల్ నుండి సిఎంఆర్ బియ్యంను నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు ఒక్కో లారీకి రూ. 25 వేల డిఎం నర్సింగరావు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. గురువారం సాయంత్రం రెబ్బెన మండలంలోని కైర్గాం వద్ద దహెగాం మండలానికి చెందిన రైస్‌మిల్ యజమాని సందీప్ మూడు లారీలకు సంబంధించిన రూ. 75 వేల డిఎం నర్సింగరావుకు ఇస్తుండగా ఏసిబి అధికారులు పక్కా ప్రణాళిక మిగతా 2లో..



# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

★ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త :**

ప్రీ ప్రైమరీ స్కూల్స్ కు ఎంపిక చేసిన ఉపాధ్యాయులుప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలనిఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే స్పష్టంచేశారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచర్లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 41 ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయని, వీటిలో విధులు నిర్వహించేందుకు వచ్చిన దరఖాస్తులలో మెరిట్ ఆధారంగా పారదర్శకంగా ఉపాధ్యాయులను మిగతా 2లో..

# విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

✳ ఐటిడిఎ పిడి యువరాజ్ మర్మాట్

**ఉట్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఇంచార్జ్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం మండలంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, తరగతిగదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మిగతా 2లో..



# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

★ తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్



**తాండూర్, నవంబర్ 6, ప్రభాతవార్త**

రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సైబర్ మోసాల పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రతిరోజూ కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ మోసాలపై, ప్రజల భద్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వ్యక్తిగత అప్రమత్తత మిగతా 2లో..

# కార్మికుల హక్కులను కాల రాస్తే సహించేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

పనిముట్లు తెప్పించాలని డిమాండ్ చేశారు. గనులపై ఏఐటీయూసీ యూనియన్ పై సిఐటియు మరియు ఐఎన్టియుసి సంఘాలు ఏఐటీయూసీ గుర్తింపు సంఘంపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టారు. మార్చ్ నెలలో నిర్వహించిన స్ట్రక్చరల్ మీటింగ్లో సంవత్సరంలో 150 మస్టర్లు తప్పనిసరి చేస్తూ నిబంధన తీసుకొస్తున్న క్రమంలో యాజమాన్యానికి ఏఐటియుసి యూనియన్ మద్దతుగా ఉండి కార్మికుల ను మోసం చేస్తున్నది అనీ అసత్య ప్రచారం చేస్తున్న సిఐటియు, ఐఎన్టియుసి సంఘాలను కార్మికులు నమ్మవద్దని వారు అన్నారు.గతంలో కార్మికులకు సొంత ఇంటి పథకంపై సిఐటియు చేసిన సంతకాల సేకరణ వారి అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి తప్ప దానివల్ల కార్మికులకు ఒరిగిందేమీ లేదని. సిఐటియు సంఘానిది ప్రచార ఆర్భాటం ఎక్కువ పోరాటం తక్కువ అని ఎద్దేవా చేశారు.కార్మికులు ఎవరూ గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ పై చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఎప్పటికైనా కార్మికుల పక్షాన పోరాడే ఏకైక సంఘం ఏఐటియుసి అని తెలియజేశారు. కార్మికులకు అన్యాయం జరిగితే ఏఐటీయూసీ చూస్తూ ఊరుకోదని వారి హక్కుల పరిరక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామన్నారు. కార్మికుల సమస్యలపై గుర్తింపు సంఘం పిలుపునిచ్చే పోరాటాలకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సంబంధిత గని మేనేజర్ లక్ష్మీనారాయణ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, పిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నరసయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ బొడ్డుల వెంకటేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు కృష్ణ చారి కమిటీ సభ్యులు దేవులపల్లి శ్రీనివాస్, సాగర్, అరుణ్ కుమార్, రత్నం రాయలింగు, నిలయ్య తిరుపతి, సురేష్, అంజి, కుమార్, నరేందర్, నవీన్, ఏసు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

## విద్యార్థులు కాలేజీకి రోజు రావాలి

నార్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:

విద్యార్థులు కాలేజీకి రోజు రావాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బాలాజీ కాంబ్లె అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బందితో కలిసి గురువారం మండలంలోని షేకుగూడ, ఖంపూర్, గుండాల గ్రామాలను సందర్శించి పోషకులతో మాట్లాడారు. విద్యార్థులు కళాశాలకు రాకపోతే హాజరు శాతం తగ్గుతుందని సూచించారు. ప్రభుత్వ కాలేజీల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. క్రమం తప్పకుండ విద్యార్థులను కళాశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. వారితో పాటు అధ్యాపకులు అజయ్కుమార్, లింగంపల్లి సుజాత, వెంకట రమణ, నరేష్ తదితరులున్నారు.



## అమ్మవారి సేవలో గ్రామ సేవకులు

సారంగాపూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:

మండలంలోని అడెల్లి పోచమ్మ విగ్రహ పున ప్రతిష్టాపన కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్స్ సేవలందించారు. కౌట్ల(బి) అడెల్లి, సారంగాపూర్, చించోలి(ఎం), రవీంద్రనగర్, గ్రామాలకు చెందిన వీరు నిత్యం ఆలయ పరిసరాలలో ఉన్నటువంటి చెత్తను తొలగించడం, అమ్మవారి దగ్గర అన్నదానానికి పూజా కార్యక్రమాలకు కావలసినటువంటి సరుకులు అందించడం, నిత్యం ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిత్యం కార్యక్రమంలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, సంధ్యారాణి, రజిత, హర్షవర్ధన్, కృష్ణ, కారోబారి, మధు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బజార్హత్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బోథ్ సిఐ గురుస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బోథ్ సిఐ గురుస్వామి, బజార్హత్నూర్ ఎస్సై సంజయ్కుమార్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా సిఐ గురుస్వామి మాట్లాడుతు సైబర్ నేరాలపై విద్యార్థులు తప్పకుండా అవగాహణ కలిగి ఉండాలన్నారు. లోన్ యాప్, ఓటిపి ఫ్రాడింగ్, ఆన్లైన్ లింక్ ఇతర నేరాల గురించి ఆయన వివరించారు. సైబర్ నేరాల గురించి కళాశాల ప్రిన్సిపల్ కే సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్స్లను తక్కువగా ఉపయోగించాలని, సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి మనము పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, ఫోన్ సేవలను దుర్వినియోగం చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మమ్మల్ని చావమంటార రైతు ఆవేదన

బజార్హత్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:

మండల కేంద్రానికి చెందిన సొన్న జగన్ అనే రైతు తాను సాగుచేసిన ఐదు ఎకరాల భూమిలో 60 క్వింటాళ్ల మొక్కజొన్న పంటను ఇచ్చోడ మార్కెట్ యార్డ్కు తీసుకు వెళ్తే అక్కడ అధికారులు తేమశాతం ఎక్కువగా ఉందని పంట కొనుగోలుకు నిరాకరించారు. ఆరుగాలం కష్టపడి పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో, అకాల వర్షంతో రైతులు నిండా మునిగి పోయారు. ఎంతో కష్టపడి ఉన్న పంటను కాపాడుకొని తీరా ఆ పంటలను అమ్ముకోవడానికి మార్కెట్లకు వస్తే ప్రభుత్వాలు నిబంధనలు పెట్టి రైతులను నట్టేట ముంచుతున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కొనుగోలు చేయకపోతే ఉరివేసుకొని చావమంటారా అని రైతు వాపోయారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి రైతుల పట్ల తేమ శాతం సడలింపులు చేయాలని వారు కోరారు.



## ఆలయంలో అన్నదానం

సారంగాపూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:

మండలంలోని అడెల్లి మహా పోచమ్మ విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాల్గవ రోజున అమ్మవారికి గరికాది దివాసం, చండీయాగం చేశారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ చైర్మన్ భీమారెడ్డి. సారంగాపూర్ మార్కెట్ చైర్మన్ ఆది, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు అట్ల పోతారెడ్డి, వేంకటరాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుల్లోజి నరసయ్య, బొల్లెడి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఏసిబీ వలలో మరో ప్రభుత్వ అధికారి..

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఎసిబి డిఎస్పి తెలిపారు. నర్సింగరావు తోపాటు కార్యాలయంలో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగి మణికంఠను అదుపులోకి తీసుకొని కార్యాలయంలో విచారణ చేపట్టారు. బాధితుడు నుండి ఇప్పటికే 16 లారీలకు సంబంధించిన డబ్బులు పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకున్నట్లు డిఎస్పి వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు లంచం కోసం సామాన్య జనాన్ని వేధింపులకు గురిచేస్తే 1064, 9154388963 (అదిలాబాద్ ఎసిబి డిఎస్పి)లో సమాచారం ఇవ్వచ్చని తెలిపారు. జిల్లాలో 20 రోజుల వ్యవధిలో రెండో అవినీతి కేసు కావడంతో ప్రజలకు ప్రభుత్వ అధికారులపై నమ్మకం పోతోంది. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఇంచార్జి కోపరేటివ్ బ్యాంక్ అధికారి మాంచెరియల్ లో ఎసిబి వలలో చిక్కుకున్న విషయం అందరికి తెలిసిందే.





మాట్లాడుతున్న ఏసిబీ డిఎస్పి మధు

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

లేక చాలామంది మోసపోతున్నారని అన్నారు. లాటరీలో డబ్బు గెలుచుకున్నారని చెప్పే నకిలీ ఆఫర్లను నమ్మవద్దని, ఇలాంటి వాటి వెనుక వ్యక్తిగత సమాచారం లేదా డబ్బు కాజేసే ఉద్దేశమే ఉంటుందన్నారు. మేము సీబీఐ లేదా పోలీసులము మాట్లాడుతున్నాం అని చెప్పే కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసుల డీపీ పెట్టుకుని వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలను, అవి జరుగుతున్న విధానం, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్సై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థులకు అవసరమైన ఐరన్, సి విటమిన్ టాబ్లెట్లను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజు వంటశాల, స్టోర్ రూమ్, త్రాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన వారు చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రీ ప్రైమరీ పాఠశాలలకు వచ్చే పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల కంటే మెరుగ్గా విద్య అందుతుందనే నమ్మకాన్ని కల్పించాలని తెలిపారు.ప్రతి ప్రీ ప్రైమరీ స్కూల్ లో చేరే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు ఇతర పరికరాలను నెల రోజుల లోపు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రీ ప్రైమరీ స్కూల్స్ లో పిల్లలను ఆకర్షించేందుకు వీలుగా పేయింటింగ్స్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయికి ఎంపికైన కరాటే కిడ్ దీక్షిత

### - వనజ చేతులమీదుగా 2 వేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందజేత

**రామకృష్ణాపూర్, నవంబర్ 06, ప్రభాతవార్త**

69వ ఎస్‌జిఎఫ్ కరాటే పోటీల్లో రామకృష్ణాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని దీక్షిత ప్రతిభ కనబరిచింది. గత సెప్టెంబర్ 20న జరిగిన జిల్లా సెలెక్షన్ పోటీల్లో 26 కిలోల విభాగంలో అండర్-14 (స్పారింగ్ ఫైట్) విభాగంలో విజయం సాధించి, ఈనెల 3న జరిగిన జోనల్ పోటీల్లోనూ గెలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైద్య వనజ, సిబ్బంది, కోచ్ జూల శ్రీనివాస్ ఆమెను అభినందించారు. దీక్షితను ప్రోత్సహిస్తూ ప్రధానోపాధ్యాయురాలు వనజ 2 వేల రూపాయల నగదు ప్రోత్సాహకం అందజేశారు. క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తున్న కలెక్టర్, డీఈఓ యాదయ్య, డివైజనల్ ఆఫీసర్ హనుమంత్‌రెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ యాకూబ్‌లకు అభినందనలు అని ఆమె పేర్కొన్నారు.



## కౌన్సిలింగ్ పేరుతో కార్మికులను అవమానించడం మానుకోవాలి

### హెచ్ఎంఎస్ నాయకులు ఎర్రంశెట్టి సాయికుమాం

**జైపూర్, నవంబర్ 06, ప్రభాతవార్త**

సింగరేణి యాజమాన్యం నాగాల పేరుతో సర్క్యులర్‌కు విరుద్ధంగా కౌన్సిలింగ్ పేరిట అవమానించడం మానుకోవాలని హెచ్ఎంఎస్ యూనియన్ ఫిట్ సెక్రటరీ ఎర్రం శెట్టి సాయి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులను వేధించే ప్రక్రియను నిరసిస్తూ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఇందారం గనులపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ సంవత్సరం జనవరి నుండి అక్టోబర్ వరకు 150 నుండి 200కు పైగా మస్టర్లు చేసిన కార్మికులను కేవలం అక్టోబర్ నెలలో 16 మాస్టర్లు చేయలేదని నేపంతో ఎంక్వయిరీ పేరిట కౌన్సిలింగ్ కు కుటుంబ సభ్యులతో హాజరుకావాలని, వేధించి, అవమానించడాన్ని హెచ్ఎంఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని మండీ పడ్డారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల చేతగానితనం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే యాజమాన్యం ఇలాంటి కౌన్సిలింగులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**లక్షెట్టిపేట, నవంబర్ 06, ప్రభాతవార్త**



పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లక్షెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్సై గోపతి సురేష్ అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు లావాదేవీలు గాని ఇతర పర్సనల్ వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. మనకు తెలియని వ్యక్తులు ఫోన్లో చేసి ఏదైనా ఓటిపి వచ్చింది చెప్పమన్న ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదన్నారు. మనకు ఏదైనా బ్యాంకులో వైద్యులు ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి వాటిని సరిచూసుకోవాలని బ్యాంకు వాళ్లు ఎవరు కూడా ఫోన్లో మన అకౌంట్ సమాచారాలు అడగరని నిత్యం జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు తోపాటు అధ్యాపకులు విద్యార్థులు పోలీసులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన 11వ జోనల్ క్రీడా పోటీలు

**లక్షెట్టిపేట, నవంబర్ 06, ప్రభాతవార్త**

ఆటల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన వారు విజయాన్ని ఆస్వాదించాలని, ఓడిన వారు కృంగి పోకుండా తిరిగి రెండవ అవకాశం కోసం ప్రయత్నించాలని, ఓడిన వారందరికీ రెండో అవకాశం తప్పకుండా ఉంటుందని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ జి. చంద్రయ్య అన్నారు. కాళేశ్వరం జోన్, 11వ జోనల్ లెవెల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. చంద్రయ్య అడిషనల్ కలెక్టర్ మంచిర్యాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, బాలికలందరూ తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో మరియు అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించాలని పిలుపునిచ్చారు. మరొక అతిథిగా వచ్చిన డీఎంహెచ్ఓ ఎస్. అనిత మాట్లాడుతూ...



తాను గవర్నమెంట్ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి వచ్చానని, అలాగే బాలికలు అందరూ, క్రీడా పోటీల్లోనే కాకుండా విద్యా విషయకంగా కూడా ఉన్నత స్థానాల్లో కొనసాగాలని ఆకాంక్షించారు. ముందుగా జిల్లా ఎడిషనల్ కలెక్టర్ జి చంద్రయ్య సీనియర్ విభాగం వాలీబాల్ క్రీడాకారులతో పరిచయం చేసుకొని వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. స్థానిక లక్షెట్టిపేట పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గోపతి సురేష్ హాజరై, క్రీడాకారుల తో పరిచయం చేసుకొని, జూనియర్ వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ కె. రమా కల్యాణి కళాశాల రిపోర్టును చదివి వినిపించారు. తమ విద్యార్థులు ఆటల్లోనూ, విద్యలోనూ.. రాణిస్తున్నారని క్రీడా పోటీలను విజయవంతం చేయడంలో తమ పాఠశాల స్టాఫ్ తమకు ఎంతో సహకరిస్తున్నారని, సొసైటీ ఉన్నతాధికారులు, తోటి పాఠశాలల ప్రధానాచార్యులు కూడా తమ తోడ్పాటు అందిస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు..దీపారాధనతో, జెండాల ఆవిష్కరణతో, ఒలింపిక్ క్రీడాజ్యోతి ప్రజ్వలనతో, క్రీడాకారులచే చేయించిన ప్రమాణంతో ప్రారంభమైన క్రీడా పోటీలు.. రేపు, ఎల్లుండి రెండు రోజుల పాటుగా కొనసాగనున్నాయి. ఈరోజు జరిగిన క్రీడా పోటీల్లో: అండర్ ఫోర్టీ విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం..టి అంజలి, లక్షటపేట, రెండవ స్థానం.. ఎం.అలేఖ్య లక్సెట్టి పేట, మూడవస్థానం జె అభినయ రామగుండం అండర్ 17 విభాగంలో 3000 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం కే అభినయశ్రీ మల్లాపూర్, రెండవ స్థానం బి. శశి కిరణ్ నంది మేడారం, మూడవ స్థానం వేదన సాయి లక్షెట్టిపేట. అండర్ 19 విభాగంలో 3000 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం పి. సుమశ్రీ చిట్యాల రెండవ స్థానం డి రాణి చిట్యాల, మూడవ స్థానం.. కే శృతి మందమర్రి. అండర్ 14 విభాగం ఖో ఖో లో: మొదటి రౌండులో సిర్పూర్ టి పాఠశాల మరియు చెన్నూర్ పాఠశాలలు గెలుపొందాయి. అండర్ 14 వాలీబాల్ విభాగం మొదటి రౌండులో: లక్షెట్టిపేట పాఠశాల, మల్లాపూర్ పాఠశాల గెలుపొందాయి. 11వ జోనల్ క్రీడా పోటీల సంబరాలలో పెద్దపల్లి డిసిఓ సత్రం దేవసేన, కాళేశ్వరం జోన్‌లోని వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, కళాశాల జూనియర్ వైస్ ప్రిన్సిపల్స్ కే. మహేశ్వరరావు, వి. గీతాంజలి, కే శిరీష లు, స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎన్ మల్లికా, టి రాధా రాణిలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**వేమనపల్లి, నవంబర్ 06, ప్రభాతవార్త**

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చెన్నూరు రూరల్ సీఐ బన్సిలాల్ సూచించారు. గురువారం నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈ ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్ ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు డ్రగ్స్ వంటి తదితర అంశాల పై యువత, విద్యార్థునులకు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం, పిన్ నెంబర్, సీవీవీ, బ్యాంకు ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఎవరైనా మీకు లాటరీ తగిలింది, కొంత డబ్బును సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఫోన్ కాల్ వచ్చినా, ఏ విధంగా అయినా మీరు మీ బ్యాంకు ఖాతా నుండి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి ఆపద సమయంలో సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి లేదా 100 లకు ఫోన్ చేసి పోలీసులకు, ఇతర శాఖల యంత్రాంగం సేవలు పొందాలని ఆయన కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దు కొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం శ్రీనివాస్, స్థానిక ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు డా. మల్లేష్, కేజీబీవి ఎస్ఓ మయూరి, పోలీసులు, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరు పాల్గొన్నారు.







## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు

**బెల్లంపల్లి, నవంబర్ 06, ప్రభాతవార్త**

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు అన్నారు. గురువారం రోజున వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సైబర్ జాగృతి దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి రోజుల్లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రజలు ఎన్ని భద్రతా చర్యలు తీసుకున్నా, వ్యక్తిగత అప్రమత్తతే అత్యంత ముఖ్యమైంది అన్నారు. ముఖ్యంగా ఉచితం లేదా ఉత్తమ ఆఫర్లు పేరుతో వచ్చే మెసేజీలు, లింకులు మోసపూరితమని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ప్రతిరోజూ కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, లాటరీ గెలిచారు లేదా పెద్ద మొత్తంలో డబ్బు వస్తుంది అని చెప్పే నకిలీ ఆఫర్లకు లోనుకాకూడదని సూచించారు. మేము సీబీఐ లేదా పోలీసులము మాట్లాడుతున్నాం అని చెప్పే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల డీపీతో వచ్చే వాటిని నమ్మరాదని సీఐ స్పష్టం చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, వాటిని ఎలా గుర్తించాలో విద్యార్థులకు వివరిస్తూ ఉదాహరణలు చూపించారు. విద్యార్థి దశలో ఎలాంటి దురలవాట్లకు, నేరాలకు దూరంగా ఉండి, చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంచుకోవాలి

**లక్షెట్టిపేట, నవంబర్ 06, ప్రభాతవార్త**

ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంచుకోవాలని లక్షెట్టిపేట ఎంఈఓ శైలజ సూచించారు. గురువారం లక్షెట్టిపేట క్లబ్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోధనా నైపుణ్యాలను పెంచుకుంటే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించే వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన

**రామకృష్ణాపూర్, నవంబర్ 06, ప్రభాతవార్త**

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామకృష్ణాపూర్ పోలీసులు విద్యార్థులను హెచ్చరించారు. "సైబర్ జాగరూకత దివస్" సందర్భంగా క్రైస్ట్ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ విద్యార్థులకు పార్ట్‌టైమ్ జాబ్ స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్‌లు, పెట్టుబడి మోసాలు, కస్టమర్ కేర్ మోసాల గురించి వివరించారు. సైబర్ మోసం జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో జోరు పెంచిన కాంగ్రెస్

### మంత్రివర్యులు వివేక్ ఆదేశాలతో మందమర్రి నాయకుల బృందం విస్తృత ప్రచారం

**మందమర్రి, నవంబర్ 06, ప్రభాతవార్త**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారం వేగం పుంజుకుంది. ప్రచార కార్యక్రమంలో భాగంగా షేక్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు మంత్రివర్యులు, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామిని మందమరి పట్టణ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా స్టేట్ ఎస్సీ సెల్ కన్వీనర్ ఆకారం రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్ పాల్గొన్నారు. నేతలు వివేక్ వెంకటస్వామితో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార వ్యూహంపై చర్చించారు. అలాగే మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పార్టీ నాయకులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అజీజ్ బాగ్, అరవింద కాలనీ, గుల్షన్ కాలనీ వంటి పలు వార్డులలో ఇంటింటికీ తిరిగి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రజలతో మమేకమవుతూ, ప్రభుత్వ పథకాలు మరియు అభ్యర్థి నవీన్ యాదవ్ అభివృద్ధి సంకల్పాన్ని ప్రజలకు వివరించారు. ప్రచారంలో మందమర్రి యువ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం గమనార్హం.

## సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

### బొగ్గు గనులపై ఏఐటీయూసీ ధర్నా

**బెల్లంపల్లి, నవంబర్ 06, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గురువారం సింగరేణి బొగ్గు గనుల్లో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని మందమర్రి ఏరియాలోని కాసిపేట బొగ్గుగనుల ఎదుట ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలపై ఇప్పటికే తమ సంఘం స్ట్రక్చర్ సమావేశాల్లో పెట్టిన సమస్యలను పరిష్కరించడంలో సింగరేణి యజమాన్యం నిరక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేసి, పాత విధానంలోనే ఇవ్వాలని, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలు ఇవ్వాలని, సింగరేణి ఉద్యోగుల సొంత ఇల్లు పథకంను అమలు చేయాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. అలవెన్స్‌ల, పెర్క్స్ పై విధించే ఆదాయపన్నును కోల్ ఇండియా మాదిరిగా యాజమాన్యమే భరించాలని, మారుపేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించి, విజిలెన్స్ ద్వారా విచారణ జరిపి పెండింగ్ లో ఉన్న వారికి ఉద్యోగావకాశం కల్పించాలని ఆయన కోరారు. డిస్మిస్ అయిన ఉద్యోగులకు ఒకసారి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. డిసిప్లినరీ చర్యల కోసం 150 మస్టర్లు చేయాలనే సర్క్యులర్‌ను యాజమాన్యం వెంటనే రద్దుచేయాలిఆయన సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షను తక్షణమే నిర్వహించాలని, ఓవర్మెన్ పాస్ అయిన సీనియర్ మైనింగ్ సర్దార్లకు డిప్లొమా హోల్డర్లకు ఓవర్మెన్ పదోన్నతి కల్పించాలని, పై సమస్యలను పరిష్కారించలని లేనియెడల తమ సంఘం ఆధ్వర్యంలో సమ్మె పోరాటం చేపట్టేందుకు వెనుకాడబోమన్నారు. ఇందుకు సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట, శాంతిఖని ఫిట్ సెక్రటరీలు మీనుగు లక్ష్మీనారాయణ, దాసరి తిరుపతి గౌడ్, నాయకులు నాగేశ్వరరావు, గని అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రాజేందర్, పార్వతి సురేష్, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్ రంజిత్, ఎలక్ట్రిక్ వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ అశోక్, మెకానికల్ వర్క్ ఇన్స్పెక్టర్ గణేష్, మైనింగ్ స్టాఫ్ ఫిట్ కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి మంతెన రమేష్, బొంకూరి రామచందర్, స్వామి దాస్, పొట్ల రాజలింగు, మిట్టపల్లి రమేష్, శ్రావణ్, దాడి రమేష్, భాస్కర్, ప్రవీణ్, సాధువుల శ్రీనివాస్, రాజేష్, రవి, రామకృష్ణ, సేఫ్టీ కమిటీ సభ్యులు, మైన్స్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, క్యాంటీన్ కమిటీ సభ్యులు, రిలే సెక్రటరీలు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్‌కు ఇన్సూరెన్స్ చేయించాలి

### ఎంపిఓ బాపు రావు

**జైపూర్, నవంబర్ 06, ప్రభాతవార్త**



గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్‌కు ఇన్సూరెన్స్ పాలసీ తప్పనిసరిగా చేయించాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రావు పల్లె గ్రామ పంచాయతీని యాప్ ఇన్స్పెక్షన్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించి, ఎక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే సమయంలో గ్రామ పంచాయతీ ట్రాక్టరుకు గన్ని సంచులను అమర్చి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, కంపోస్టు షెడ్ నందు వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూలును వేగవంతం చేసి ఈనెల 15 వరకు అన్ని గ్రామ పంచాయతీలలో 100 శాతం పూర్తి చేయాలని, అన్ని రకాల రిజిష్టర్లు మెయింటెన్ చేయాలని, వాటిని అప్డేట్ చేసి ఉంచాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లను వెంటనే రెన్యువల్ చేయించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్సియల్ ఆడిట్ పేరాలను డ్రాప్ చేయించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవనాన్ని సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. బాపు రావుతో పాటు పంచాయతీ కార్యదర్శి డి.తిరుమల, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ జాగరూకత దివాస్

### విద్యార్థులకు ఏసీపీ, సీఐల సమగ్ర అవగాహన

**మందమర్రి, నవంబర్ 06, ప్రభాతవార్త**



మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం రోజున సైబర్ జాగరూకత దివాస్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. డిజిటల్ ప్రపంచంలో విద్యార్థులు సురక్షితంగా ఉండేలా అప్రమత్తత పెంచే లక్ష్యంతో మందమర్రి పోలీసులు ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. మందమర్రి ఎస్.ఐ. రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు వందమంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన అతిథులుగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, మరియు పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ,"ప్రస్తుత సాంకేతిక యుగంలో యువతరం సోషల్ మీడియా మరియు ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరగాళ్లు నమ్మకాన్ని ఆయుధంగా మార్చుకుని మోసాలు చేస్తున్నారని" తెలిపారు. విద్యార్థులు మాత్రమే కాకుండా, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకూ ఈ అవగాహనను పంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, నేటి కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల రకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచితుల నుండి వచ్చే కాల్స్, లింకులు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ పంచకూడదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రధానంగా ఈ నాలుగు రకాల సైబర్ మోసాల గురించి వివరించారు. పార్ట్‌టైమ్ జాబ్ స్కామ్‌లు – సులభంగా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి మోసం చేయడం. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ – పోలీస్ లేదా ప్రభుత్వ అధికారుల పేరుతో బెదిరించి డబ్బులు దోచుకోవడం. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ – అధిక లాభాలు వాగ్దానం చేసి పెట్టుబడిదారులను మోసం చేయడం. కస్టమర్ కేర్ మోసాలు – నకిలీ హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా వ్యక్తిగత వివరాలు దొంగిలించడం. ముగింపులో అధికారులు విద్యార్థులకు సూచించారు: ఎలాంటి సైబర్ మోసం జరిగినా తక్షణమే 1930 నంబర్‌కి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయాలని. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించి, సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై చైతన్యం కలిగించడంలో మందమర్రి పోలీసుల ప్రయత్నం ప్రశంసనీయమైంది.

# నేడు వందేమాతర గేయం సామూహిక గీతాలాపన

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య

**నస్పూర్, నవంబర్ 06, ప్రభాతవార్త**



వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నేడు ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బంకిం చంద్ర చటర్జీ వందేమాతర గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిందని, ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ/ స్థానిక సంస్థల/ ఎయిడెడ్/ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమ సంబంధిత ఫోటోలు, వివరాలతో అదే రోజు సాయంత్రం ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# శాంతిఖని గనిని సందర్శించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

**బెల్లంపల్లి, నవంబర్ 06, ప్రభాతవార్త**



బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్‌స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురువారం విద్యా పర్యటనలో భాగంగా శాంతిఘని మైన్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ అబ్దుల్ ఖాదర్, ఘని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, సేఫ్టీ ఆఫీసర్ రాజు పర్యవేక్షణలో విద్యార్థులకు బొగ్గు ఘనుల ప్రాంతంలో బొగ్గు తవ్వకాల ప్రక్రియ, యంత్రాల వినియోగం, భూగర్భ గనుల నిర్మాణం, మరియు కార్మికుల భద్రతా చర్యల గురించి ప్రత్యక్షంగా వివరించారు. అలాగే గనుల అధికారులు విద్యార్థులకు బొగ్గు తవ్వక విధానం, విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ చర్యలు, మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ యొక్క సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఇలాంటి విద్యా పర్యటనలు విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన, పరిశీలనా దృష్టి, మరియు సామాజిక బాధ్యతాభావం పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయి అన్నారు. ఈ పర్యటనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విలువైన అనుభవాన్ని పొందారు. ఈ పర్యటనకు సహకరించిన ప్రాజెక్ట్ ఆఫీస్, మేనేజర్, సేఫ్టీ ఆఫీసర్, అధికారులకు పాఠశాల తరుపున డైరెక్టర్ ఈ. రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజ రమేష్‌లు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించండి

**కెరమెరి, నవంబర్ 6 ప్రభాతవార్త :**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలం పరందోలి, ముఖదంగూడ గ్రామపంచాయతీలోని గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని జిల్లా విద్యుత్ శాఖకు జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ అన్నారు. తమ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ముఖదంగూడా, పరండోలి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంట పొలాలలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక కేవలం వర్షాధారం పైనే వ్యవసాయం చేస్తూ బతుకుతున్నామని తమ గ్రామాలలో విద్యుత్ స్తంభాలపై తీగలు వేలాడుతున్న విషయం అధికారులకు చెప్పిన స్పందించడం లేదని తద్వారా గ్రామంలో విద్యుత్ తీగలు గాలి దుమారంతో ఒకదానికొకటి తగిలి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఇప్పటికైనా స్థానిక మండల, జిల్లా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తమ గ్రామాల విద్యుత్ తీగలను సరిచేయాలని మరియు గ్రామానికి త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు. ఈ సమస్యను ఎన్ హెచ్ ఆర్ సి ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా పోరాడుతామని జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ కమిటీ సభ్యులు శశాంక్, సాయి కుమార్ అన్నారు.



## మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావును కలిసిన ఎంపీడీఓ, ఏపీఓ

**కాగజ్‌నగర్, నవంబర్ 6 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలో నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఉజ్వల్ కుమార్, ఏపీఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ గురువారం మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావువారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పూల మొక్కను అందజేశారు. అధికారులకు కోనేరు కృష్ణరావు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల సేవలో ముందంజ వేయాలని సూచించారు. మండల ప్రజల అభ్యున్నతే తమ లక్ష్ యమని అధికారులిద్దరూ తెలిపారు.

## రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని మానుకోవాలి

**- తాండూర్ సిఐ దేవయ్య**

**తాండూర్, నవంబర్ 6 ప్రభాతవార్త :**

రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని మానుకొని సత్ప్రవర్తనతో సమాజంలో మంచిగా జీవించాలని తాండూర్ సీఐ దేవయ్య అన్నారు. తాండూర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై కేసులు అధికారుల సూచనల ప్రకారం రౌడీ షీట్ తొలగ్నిచడం జరుగుతుందన్నారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీ షీట్ రికార్డ్‌లో వారు చేసే మంచి పనులు కూడా నమోదు చేస్తామన్నారు. పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందన్నారు. సమావేశంలో తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



# నేడే కొలువుదీరనున్న అడెల్లి మహా పోచమ్మ అమ్మవారు

**సారంగాపూర్, నవంబర్ 6 (ప్రభాతవార్త):**

ఉత్తర తెలంగాణలోని సహ్యాద్రి పర్వతశ్రేణుల నడుమ ఆవాసమై ఉన్న అడెల్లి గ్రామం నేడు భక్తజనాలతో కిటకిటలాడుతోంది. శతాబ్దాలనుండి చుట్టు పక్కల ప్రజల ఆరాధ్య దేవతగా, కోరికలు తీర్చే తల్లిగా పేరుగాంచిన మహా పోచమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేద మంత్రాలు, మంత్రఘోషలతో అడెల్లి అటవీ ప్రాంతం మారుమోగుతోంది.





**ప్రాచీన శైలిలో ఆలయ నిర్మాణం..**

అమ్మవారి గర్భగుడి, అర్థమంటపం పూర్తిగా కృష్ణశిలలతో ప్రాచీన శైలిలో నిర్మించబడింది. సిమెంటు, ఇటుకలు లేకుండా, వందల ఏళ్లపాటు నిలిచేలా రాళ్లతో నిర్మాణం చేపట్టారు. ఈ శిలలు తమిళనాడులోని మహాబలిపురం నుంచి ప్రత్యేకంగా తెప్పించబడ్డాయి. శిల్పి వెంకటేష్ ఆధ్వర్యంలో శిల్పాల ఆకృతిని చెక్కి ఆలయ రూపం దాల్చింది.

**మహాబలిపురం నుంచి అమ్మవారి విగ్రహం..**

కొత్తగా తయారైన మహా పోచమ్మ అమ్మవారి విగ్రహం మహాబలేశ్వరంలోని కృష్ణశిలలతో చెక్కబడింది. ఆమెతో పాటు సప్తమాంత్రికలు, పోతరాజు, ద్వారపాలకులు, ధ్వజస్తంభం తదితర విగ్రహాలను కూడా మహాబలిపురం నుంచే తెప్పించారు.

**పునఃనిర్మాణానికి 6.60 కోట్లు..**

2023లో అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచనలతో ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖ నుంచి రూ.6.60 కోట్లు మంజూరు చేయించగా, ఏడాది వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేశారు.





**ఉత్సవాల వైభవం..**

నవంబర్ 3వ తేదీన అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం జలాభిషేకం, దాన్యదివాసం, ఫలపుష్పదివాసం, గరికదివాసం, పాలాభిషేకం కార్యక్రమాలు భక్తి నిబద్ధతతో నిర్వహించారు. ఐదవ రోజు వేదమంత్రాల మధ్య అమ్మవారిని ఆలయ గర్భగుడిలో యంత్ర, ప్రతిష్ఠ చేశారు. బాల ఆలయంలో ఉన్న విగ్రహాలను కూడా గర్భగుడిలో ప్రతిష్ఠించారు.

**భక్తుల రద్దీ, అన్నదానాలు..**

ఉత్సవాల కాలంలో గురుమంచి చంద్రశేఖర్ పండితుల ఆధ్వర్యంలో యజ్ఞయాగాలు, హోమాలు కొనసాగాయి. వేలాది మంది భక్తులు అడెల్లి, సారంగాపూర్, కౌట్ల (బి), జామ్, చించోలి, స్వర్ణ, జెవిలి, బీరవెల్లి, వంజర్ గ్రామాలనుంచి తరలివచ్చారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజకీయపార్టీలకు అతీతంగా నాయకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, విరాళాలు అందజేశారు.

**ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కేంద్రం..**

పునఃప్రతిష్ఠాపనతో అడెల్లి మహా పోచమ్మ దేవాలయం ఉత్తర తెలంగాణలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి కేంద్రంగా మారనుందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- కెరమెరి ఎస్సై మధుకర్**

**కెరమెరి, నవంబర్ 6, ప్రభాతవార్త :**

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులకు జాగ్రత్తలు తెలపాలని ఎస్సై మధుకర్ అన్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు కెరిమెరి పోలీసులు మండలంలోని హట్టి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెరిమెరి ఎస్సై మధుకర్ పాల్గొని మాట్లాడారు విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ ట్రేడింగ్, ఫేక్ లింకులు, ఫోన్ కాల్స్ వంటి మార్గాల ద్వారా సైబర్ మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎవరికీ వ్యక్తిగత వివరాలు (ఆధార్ నంబర్, బ్యాంకు వివరాలు, ఓటిపి పాస్‌వర్డ్‌లు మొదలైనవి ఇవ్వకూడదని వివరించారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాల గురించి తెలుసుకొని, ఆ సమాచారం తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని సూచించారు . కుటుంబ సభ్యులు కూడా ఇలాంటి మోసాల నుండి జాగ్రత్తపడేలా చేయాలని ఎస్సై పిలుపునిచ్చారు. ఇంకా, విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ, కష్టపడి చదువుకోవడం, సమయపాలన ఎంతో ముఖ్యం అని సూచించారు. గురువులను గౌరవిస్తూ, పట్టుదలతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఎన్హెచ్ఎం సిబ్బందికి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**

**ఆసిఫాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త:**

ఎన్హెచ్ఎం లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్‌డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయ సూపర్డెంట్ సఫియోద్దీన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు పస్తులు ఉంటూ కుటుంబ పోషణ భారంగా మారి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల లాగానే వీరికి కూడా ప్రతినెలా ఒకటవ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి దివాకర్, ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవి, కోశాధికారి నగేష్, సహాయ కార్యదర్శి రాందాస్, ఎన్హెచ్ఎం సిబ్బంది శ్రీదేవీ, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవాని, సమత తదితరులు పాల్గొన్నారు.





## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### - డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్

**వాంకిడి,నవంబర్ 6, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం ఖిరిడీ గ్రామంలో డివైఎఫ్ఐ 46వ దినోత్సవం సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని లూథియానగరంలో డివైఎఫ్ఐ నవంబర్ 1,2,3వ తేదీలలో ఏర్పడిందన్నారు. దేశం కోసం అనేకమంది యువత ప్రాణాలర్పించారు అన్నారు. వారి త్యాగాల ఫలితమే నేడు డివైఎఫ్ఐ ఆవిర్భాదినోత్సవాలు జరుపుకుంటున్నమన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు అనేక హామీలు ఇస్తూ వాటిని అమలు పరచడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువతను కలుపుకొని నిరసనలు నిర్వహిస్తామని అన్నారు. ఉద్యోగం ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి ప్రభుత్వంలో విద్యార్థులపై యువతలపై అనేక దాడులు జరుగుతున్నాయని అన్నారు. కొమురం భీం జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని అన్నారు.



## కాగజ్‌నగర్‌లో షీ టీమ్ అవగాహన కార్యక్రమం

**కాగజ్‌నగర్ ,నవంబర్ 6, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్లో షీ టీమ్ ఏహెచ్‌టియు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌ఛార్జ్ ఎస్సై బిక్కులాల్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు వేధింపులు, చీటింగ్, సైబర్ మోసాలు, ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలు ఎదురైనప్పుడు డయల్ 100 లేదా షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712670565 నంబర్‌కు వెంటనే సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, షీ టీమ్ నిరంతరం పర్యవేక్షణ చేపడుతుందని తెలిపారు. విద్యార్థినులు తమ హక్కులు, భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సయ్య, ఏఎస్ఐ సునీత, డబ్ల్యుపిసి రమ, పిసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నార్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో గురువారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఉత్తం ముఖాడే ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తేమ 12 శాతం మించకుండా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 8100 రూపాయలు మద్దతు ధర ప్రకటించిందని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మారుతీ, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మాజీ జడ్పీటీసీలు బ్రీజులాల్, జ్ఞానోబా పుష్కర్, శితిదిళీ ఇంచార్జ్ చైర్మన్ సురేష్ ఆడే, రెడ్డీ నాయక్, కోర్రల మహేందర్, రైతులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలో రైతులు పంటను విక్రయించి మద్దతు ధర పొందాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త**

రైతులు పండించిన పత్తి పంటను సిసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామ శివారులోని ఆర్ఎస్ జిన్నింగ్ మిల్లులో సిసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి ‌ ‌ ‌ ‌ ‌ ‌ ్మ, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారి నుండి మద్దతు ధర చెల్లించి పంట కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన పత్తి పంటను దళారులకు, ప్రైవేట్ వ్యాపారస్తులకు విక్రయించి నష్టపోకూడదని తెలిపారు. ప్రతి రైతు కపాస్ కిసాన్ యాప్ ను వినియోగించుకొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని, ఆ దిశగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 3.30 లక్షల ఎకరాలలో పత్తి పంట సాగు చేశారని, సుమారు 38 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 24 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 8,110 రూపాయలు మద్దతు ధర అందిస్తుందని, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు పత్తి తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం చెల్లిస్తున్న మద్దతు ధర, తేమశాతం అంశాలపై ప్రజలందరికీ తెలిసే విధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి మిలింద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు అలీబిన్ అహ్మద్, సిసిఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వహకులు, రైతులు పాల్గొన్నారు.



# కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ఉట్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:**

తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల డైలీవెజ్, ఔట్సోర్సింగ్, హాస్టల్‌లలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు భోజ్జ ఆశన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల లక్షేటీపెట్, యేందా, నర్సాపూర్, సాలెగూడ, హస్నాపూర్ హాస్టలను సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్లో పనిచేసే కార్మికుల సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో హాస్టల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, డైలీవెజ్ కార్మికుల గత ఆరు నెలల నుండి పెండింగ్ వేతనాలు చెల్లించడం లేదని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్మికులు హాస్టల్లో విద్యార్థులకు పోషిక ఆహారాన్ని అందిస్తూ విద్యార్థుల మంచి చెడులను చూసుకునే హాస్టల్ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకపోవడం చాలా బాధాకరమని, కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని జీవో నెంబర్ 64 రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అర్కా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



**సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు**

# ప్రభుత్వం ఉద్యోగుల డిపిఆర్‌సీలను వెంటనే ప్రకటించాలి

**ఉట్నూర్, నవంబర్ 06:**

**ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ సభ్యులు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ హెచ్చరించారు. గురువారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే రెండు దశల ఉద్యమాలు ప్రకటించాల్సి వస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్న సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం విడ్డూరం అన్నారు. ఇప్పటికే తెలంగాణ ఎంప్లాయిస్ పక్షాన, ఉపాధ్యాయ సంఘాల యూఎస్పిసిగా ఏర్పడి ఉద్యమాలు చేశామన్నారు. స్పందించిన ప్రభుత్వం అధికారులతో ఒక కమిటీని, మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించిన సమస్యలు కొలిక్కి రాలేదన్నారు. 2023 జూలై నుండి రావలసిన పిఆర్సి ప్రకటించలేదని, ఇప్పటికే ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా ఇవ్వాల్సిన డిఏలు గతంలో ఎన్నడూ లేనంతగా పెండింగ్లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్సిలర్లకు రావాల్సిన బిల్లులు అన్ని పెండింగ్లో ఉన్నాయని, దీంతో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు మానసిక ఇబ్బందులు అసహనానికి గురై కొందరు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక మరణిస్తున్నారన్నారు. మార్చి 2024 తర్వాత రిటైర్ అయిన వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించబడలేదు అన్నారు. వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, ఎంప్లాయిస్ హెల్త్ సీన్ సరిగా అందుబాటులో లేదని, పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం విన్నవించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయులు ఉద్యోగులు ఉద్యమాలు చేస్తే విద్యారంగం తో పాటు, ప్రభుత్వ సేవలు స్తంభిస్తాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిలర్ సి వీరయ్య, బండి రాజారాం, రాథోడ్ రవిత, రవి చందర్ గౌడ్, లావుడియా సుజాత, కే మమత, లకావత పంచపూలలు పాల్గొన్నారు.





## ధర్మ యుద్ధ పోస్టర్లు విడుదల

**ఉట్నూర్, నవంబర్ 06, ప్రభాతవార్త:**

ఈనెల 23న ఉట్నూర్‌లో నిర్వహించనున్న ధర్మ యుద్ధ పోస్టర్లను గురువారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందురు దాదిరావు, ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ అధ్యక్షులు మెస్రం దుర్గు పటేల్‌లు మాట్లాడుతూ చట్ట బద్దత లేని లంబాడలను ఎస్‌టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్‌తో ఈ నెల 23న చలో ఉట్నూర్ బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని కోరారు. ఆదివాసీ బచావో, లంబాడా హటావో అనే ప్రధాన నినాదంతో గత 30 సంవత్సరాల నుండి పోరాటం చేస్తూన్నామని వలస వచ్చిన లంబాలను ఎస్‌టీ జాబితా నుండి తొలిగించలనే ఏకైక డిమాండ్‌తో ఉట్నూర్‌లోని ఎంపీడీఓ గ్రౌండ్‌లో ధర్మ యుద్ధం పేరిట ఆదివాసిల భారీ బహిరంగ సభకు అన్ని ఆదివాసీల సంఘాల నాయకులు మద్దతు పలికారు అన్నారు. ఈ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఆదివాసులు పెద్ద మొత్తంలో తరలి రావాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా అంటేనే ఉద్యమాల గడ్డగా పేరు పొందిందని, అలాంటిది ఉట్నూర్ సభకు భారీ నుంచి అతి భారీగా ప్రజలు తరలి వచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు కలిసి పని చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో తులం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెందూర్ పుష్పారాణి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నగేష్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి బాపురావు, ఆదివాసి సంఘాల నాయకులుగేడం మారుతీ, బొంత ఆశ రెడ్డి, ఆడ హన్మంత్ రావు, తొడసాం నాగోరావు, సెడ్మాకి రామారావు, వెడ్మ చంపత్, జంగు పటేల్, నైతం చిత్రు పటేల్, పెందోర్ త్రిమూర్తి, గేడం నిరంజన్, పెందోర్ మధు, పూసం జైతు, ఆదివాసీ తొడసాం ఇంద్రు, సిడం రమేష్, ప్రచార కార్యదర్శి పెందోర్ రాజేశ్వర్, రాయి సెంటర్ గితేదార్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ రిజర్వేషన్లపై పోరాటాన్ని పల్లె పల్లెకు విస్తరిస్తాం

**- బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రమేష్**

**ఆసిఫాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త :**

బీసీ రిజర్వేషన్లపై చేపట్టిన పోరాటాన్ని పల్లె పల్లెకు విస్తరిస్తామని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రూపునార్ రమేష్ పేర్కొన్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం వద్ద బీసీ జేఏసీ నాయకులు మౌన దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ముందుగా పూలె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని, అన్ని రంగాలను శాశిస్తూ, బీసీలను అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, లేనిపక్షంలో బీసీ ఉద్యమాన్ని విస్తరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్తామన్నారు. దేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వచ్చిన తర్వాత రిజర్వేషన్లు లేని వర్గం అంటూ ఏదీ లేదన్నారు. డిసెంబర్ మొదటి వారంలో బీసీల చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి చేపడతామని, జనవరి చివరి వారంలో లక్ష మందితో హైదరాబాదులో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. ఈ మోన దీక్ష కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ పూర్తి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా బీసీ జేఏసీ కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్ కుమార్, బీసీ జేఏసీ ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, గాజుల జక్కన్న, కాంద్రే విశాల్, పొన్న రమేష్, మాచర్ల శ్రీనివాస్, మిరాజ్ భాయ్, నికోడె రవీందర్ , బీసీ జేఏసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పొన్నాల నారాయణ, నాగోష్య శంకర్, వైరాగడె మారుతి పటేల్తో పాటు పలు కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, నవంబర్ 6, ప్రభాతవార్త :**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ఇతర అధికారులతో కలిసి వానాకాలం 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోలు, ఏర్పాట్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ ధాన్యము కొనుగోలు ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా చేపట్టాలని, జిల్లాలో 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 40 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని, రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తరువాతే నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందని, ఇతర రాష్ట్రాల ధాన్యం జిల్లాలోకి రాకుండా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్షి ్మ, జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయ, రవాణా శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఉట్నూర్, నవంబర్ 06, ప్రభతవార్త:**



బాధితుల పిర్యాదులను, సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ అన్నారు. గురువారం ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. మొదటగా జిల్లా ఎస్పికి, ఉట్నూర్ అదనపు ఎస్పి కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఎస్సై కె ప్రవీణ్ కుమార్‌లు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. జిల్లా ఎస్పి పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రతను కలిగి ఉండాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా సిబ్బందిని కేటాయించి పోలీసుల గౌరవం పెంచేలా విధుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. సిబ్బందిచే ప్రత్యేకంగా డ్రిల్ నిర్వహించి ప్రతి శనివారం పర్యట్ నిర్వహించాలని శారీరక దృఢత్వం శారీరక వ్యాయామం ఆరోగ్యానికి కీలకమని తెలిపారు. పోలీస్ స్టేషన్ సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్‌ను నిర్వహించి అత్యవసర పరిస్థితులలో శాంతిభద్రత సమస్యలు తలెత్తిన పరిస్థితులలో వ్యవహరించవలసిన తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క కిట్ ఆర్టికల్స్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి కేటాయించిన పోలీసు సామాగ్రిని వస్తువులను వాటి నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో దీర్ఘకాలికంగా ఉన్న వాహనాల స్థితిగతులు, వాటి కేసుల వివరాలు తెలుసుకుని పరిశీలించారు.

## నిరక్ష్యం వహించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయండి

**- బిఆర్‌ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్**

**ఉట్నూర్, నవంబర్ 06, ప్రభతవార్త:**



మండల కేంద్రంలోని కెబి ప్రాంగణంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అందించే భోజనంపై నిరక్ష ్యం వహించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని బిఆర్‌ఎస్‌వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావులు అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో పిఓకు సమస్యలతో కూడిన వినతి పత్రర అందజేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ ఉట్నూర్ మండల కేంద్రంలోని స్థానిక కెబి ప్రాంగణంలో ఏకలవ్య మోడల్ స్కూల్‌లో బుధువారం రాత్రి విద్యార్థులు అందించిన సమాచారం ప్రకారం గత వారం రోజుల నుండి తినే ఆహారంలో పురుగులతో కూడిన ఆహారం వండడం, కుళ్ళిపోయిన కూరగాయలు వండడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మెనూ ప్రకారం భోజనం అందించకుండా విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. అక్కడ ఉన్న సిబ్బంది మాత్రం నెయ్యితో పాటు చపాతీలు చేసుకుని తింటూ కాలం గడుపుతు విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారంకు దూరం చేయడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా అధికారులపై తక్షణమే చర్యలు తీసుకొని సస్పెండ్ చేసి విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కోలా సత్తన్న, దూట మహేందర్, యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ముజీబ్, క్రాంతికుమార్, అజ్మీరా జయచంద్ర, సాజిద్, సిద్ధికి, పొన్నం సాయికుమార్, కోటేష్, బొడ్డు నరేష్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చూ ప్రమాదాలు అరికట్టు..

**బోథ్, నవంబర్ 06, ప్రభాతవార్త**



మండలంలోని కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారి రోడ్లపై ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఈ రహదారి కుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ప్రమాదాలను నివారించేందుకు బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం గుంతలు పూడ్చి తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు షేక్ అలీ, దాసరి పురుషోత్తంలు మాట్లాడుతూ ప్రమాదాలను నివారించాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఇటీవలే చేవెళ్ల సమీపంలో ఒక గుంత ఊహించని ప్రమాదానికి కారణమైందని అందుకే ముందు జాగ్రత్తగా రోడ్డుపై ఉన్న పెద్ద గుంతలను సామాజిక సేవ దృక్పథంతో ఆలోచించి అటువంటి ప్రమాదాలకు చోటు ఉండకూడదని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలను చైతన్యపరిచే విధంగా ఉన్న ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సీఐ గురు స్వామి, ఎస్సై శ్రీ సాయి లు పాలుపంచుకొని సొసైటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అబ్దుల్ రావుఫ్, రమణ గౌడ్, ప్రకాష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.